తూండడంచేత రాత్రి లైలామజ్నుచూసి మర్నాడు మావూరికి పోదామని నిశ్చయించా. పట్టుకొనివెళ్లవలసిన సామాన్లు కొనడానికి బజారుకు వెళ్ళాను. సామాన్లన్నీకొని హొటలువేపు నడిచా. ఇంతలో నాకోబంధువు తారసిల్లాడు. అతను మాతోడల్లుని బావమరిదితండ్రి అంటే మా తోడల్లుని చెల్లెలికి మామగారు! ఆయన్ని నేను రెండేళ్లక్రిందట మా తోటల్లునితోరాగా చూశాను. ఆ పరిచయాన్ని పురస్కరించుకొని నేనే మొదట పలకరించా. మొదటి రెండు పిలుపులకు పలుకలేదు. కాని మూడో పిలుపుకి తిరిగిచూసి "ఎవరు నాయనా నువ్వు?" అనిఅడిగాడు. నేను ఫలానా అన్నాను. "అయ్యో! నువ్వేనా నాయనా! ఎప్పుడొచ్చావు? పోని వచ్చినవాడివి మాయింటికోసారి వచ్చావూ?"అని అన్నాడు. "లేదండి మొన్ననే వచ్చాను! పనులు చాలా వుండడంచేత రాలేకపోయాను! పోనీ ఈసారి వచ్చినప్పుడు వస్తానులెండి!" అన్నా గౌరవంగా! "ఇంకా మరెప్పుడొస్తావు? ఇవాళ మాయింట్లో భోజనం చేసేదాకా వదలను" అని బలపంతాన తీసికొనిపోయాడు. హొటలు ఖర్చు తగ్గుతుందని లోలోన సంతోషించినా పైకి మాత్రం గౌరవానికి లోపంరాకుండేలాగ "క్షమించండి! మామగారు! ఇప్పుడనేకమైన పనులున్నాయి! ఈసారి వచ్చినప్పుడు వస్తాను! ఇప్పుడుమాత్రం వదలండి!" అని అంటున్నా. అయినా ఆయన వదలకుండా తీసికొని పోతున్నాడు! మైలు దూరం నడిచేసరికి అయనయిల్లు చేరుకున్నాం. ఇల్లును సమీపించగానే ఆయన నన్ను వీధిగుమ్మంవద్ద ఆపి తన రెండుచేతులతో నా రెండు భుజాలను పట్టుకొని ఎదురుగా నిల్చొని "ఇదిగో అబ్బాయీ! నీ కిప్పుడు చాలా పనులున్నా యంటున్నావు. ఈ సారి వచ్చేటప్పుడు వస్తానంటున్నావు కనుక నిన్నిప్పుడు వదిలేస్తున్నాను. ఈ సారి వచ్చేటప్పుడు తప్పకుండా మా ఇంటికి రావాలి!" అని చెప్పి మరక్కడ ఆగకుండా యింట్లోకిపోయి తలుపు బిడాయించాడు. నేను విస్తుపోయి నిల్చున్నాను! అప్పుడు చేసేదేవిటి? చచ్చినట్టు మైలున్నరదూరం నడిచి వెళ్లి ఒంటిగంటకు గిన్నె అడుగున మిగిలిన పాడిమెతుకులు హొటల్లోతిని క్షుద్బాధ తీర్చుకున్నాను. అప్పటినుంచీ బంధువుల ఇళ్లకు వెళదామన్నా, కనబడిన బంధువుల్ని పలకరిద్దామన్నా భయం పట్టుకుంది.

పంతుల కృష్ణారావు.

* * *

## దూడగడ్డికోసం

నాకు పదేళ్ల వయసులో మా తాతగారి గ్రామం జగన్నాధపురం వెళ్ళి నాలుగేండ్లు వుండవలసి వచ్చింది. అక్కడ బడిలో 5 వ తరగతి చదువుతున్నాము. అవూళ్లో కొబ్బరితోటలు విపరీతంగా పెంచబడివున్నాయి. నేను నా క్లాసు విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా ఏ పనిచేసినా, మా అందరం జట్టుగా చేసేవాళ్లం, కామశాస్త్రి దొడ్లో చాలా కొబ్బరిచెట్లున్నాయి. విపరీతంగా కాచాయి. మాకు వాటిలో సగం కాజేయాలని బుద్ధిపొడమింది. చీకటి రాత్రులు రాగానే, అర్ధరాత్రిసమయములో వెళ్ళి కోసుకురావడం మరునాడు షాపుకారుకు విక్రయించడం జరిగించుతున్నాం. ఈసంగతి ఆనోటా యీనోటా వెళ్లి ఆశాస్త్రి చెవుల్లో మారుమ్రోగింది. ఇది ఏగుంట వెధవల పనో అని రాత్రులందు కాపుకాయుట ప్రారంభించాడు. అతను కాచినంతసేపు మేము పొంచివుండి తర్వాత మా పని మేము యథాప్రకారం చేసేవాళ్లం. అతనుకాపుకాస్తున్నా కాయలుమాత్రం ఉండడంలేదు. అందులో ఓరోజున చాలారాత్రివరకు కాపువుండి లోనికి పోయినాడు. మేము మామూలుగా చెట్లు పనిపుచ్చుకున్నాము. దబ, దబమని కాయలుపడుతున్నాయి. ఇంతలో ఎవ్వరా మీరు లంజకొడకల్లారా! మీకిదేం పోయేకాలంరా! రండ్రారండి దొంగలు, దొంగలో, అని బిగ్గరగా శాస్త్రి ఉరిమాడు. ఆగోల విని అందరూ వస్తున్నారనగా మేము చల్లగా చెట్లుమీద నుండి క్రిందకి ఉరికాము. మాలో చవటదద్దమ్మ చెట్టుమీదనుండి దిగలేకపోయినాడు. ఎంతోసేపు పట్టలేదు. చాలామంది మూగారు. ఎవడవురానీవు! కొబ్బరిచెట్టు ఎందు కెక్కావు? డొక్కచీలుస్తా బుర్ర పగలగొట్టా దిగు అనగా మాతాత నేను గడ్డి తేలేదని తంతే దూడగడ్డికోసం ఎక్కాను మరేం లేదు. ఈతప్పు కాయండి, యీతప్పు అంటున్నాడు. మా పరువు పోగొట్టినాడని ఛీ వెధవా దిగిరా నీ పనిపట్టాం అని అందరికిమల్లె మేమూఅన్నాము. వాడూ దిగగానే బెత్తంపుచ్చుకొని చేతికొచ్చిన దెబ్బ కాలుకొచ్చిన తన్ను తన్నారు. దాంతో వాడి ముఖం నెంబరు సెవెన్ లా మారింది. బాబోయ్ యీతప్పు కాయండి చెంపలేసుకుంటాను అని ఆ అర్ధరాత్రిసమయములో ఒకటే రోదన. బాగా అయిందంటే మాబాగా అయిందని అందరూ దారితీశారు. మావాడ్ని కలిసి ఏం రోయ్ బ్లాకుమార్కు సంపాదించావేమిట్రా అనే సరికి వూరుకోండ్రా. దూడగడ్డికి రా, దూడగడ్డికి అన్నాడు. నవ్వుకుంటూ అందరం యిండ్లకుచేరి ఆరోజునుండి ఆ పనికి ఓ సలాం పారేశాం.

కుమారి ఇందిరా